# ఎంత మార్పు తెస్తుంది?

యం. హీరాలాల్ రాయ్

తనవాళ్ళూ, పరాయివాళ్ళూ అనే భావం లోకంలో బాగా ప్రబలిపోయింది. తన చెల్లెళ్ళు, తన అక్కలు, తన అన్నల్లు, తన తమ్ముళ్ళు—ఇది ఒకవరస. తన కులంవాళ్లు, తన మతంవాళ్లు, తన పార్టీ వాళ్లు, తన క్లాసువాళ్లు-ఇది ఇంకోవరస. తనకుగానీ, తనవాళ్ళకుగానీ ఏదైనా అవమానమో అన్యాయమో జరిగితే, తాను ఎంతో బాధపడతాడు. అదే పరాయివాళ్ళకి జరిగితే తనకేమీ అనిపించదు.

లోకంలో ఒకళ్లను బాధపెట్టితేనేగాని ఆనందం పొందలేని వాళ్లున్నారు. ఖూనీలుచేసి ఆత్మానందం పొందినవాళ్ళనికూడా మనం చూస్తున్నాం. స్త్రీలని చెరిచి మురిసిపోయిన ధీరులు కూడా లేకపోలేదు. ఐతే ఈ మహామహులు దుర్మార్గుల్లో అగ్రవర్గానికి చెందినవాళ్లు. ఇక వీళ్లల్లో సామాన్యులు, వీళ్లు బజారులోపోయే చక్కని అమ్మాయిలమీద సిగరెట్టు ముక్కలు విసరడం, పిచ్చికూతలు కూయడం, సినిమా థియేటర్లవద్ద ఆడవాళ్ళకు చిరాకు కల్పించడం, రైలుపెట్టెల్లో అమ్మాయిలని అగచాట్ల పాలు చేయడం చేస్తూంటారు.

హరిగాడు ఈ చిన్నజాతి దుర్మార్గులకు నాయకుడు. 'కీలుగుఱ్ఱం' పిక్చరు చూడ్డానికి మావూరి చుట్టుపట్టు పల్లెలనుంచి వచ్చిన ఆడాళ్ళని నానాఏడుపులూ ఏడిపించి, ఒక చిన్న రౌడీ ముఠాకు నాయకుడనిపించుకున్నాడు. సూపరెండెంటుకొడుకు కావటంవల్ల, అతన్ని యెవళ్ళూ గట్టిగా మందలించగలిగేవాళ్లు కారు.

ఒకనాడు డాక్టరుగారి అమ్మాయి తెల్లని మల్లుచీర కట్టుకుని మ్యాటినీ చూచి తిరిగివస్తూంటే పక్కగా నడుస్తూ ఆవిడ చీరమీద కలంతో ఎర్రసిరా చల్లాడు. పాపం, డాక్టరుగారు ఈ విషయం తెలిసికూడా యేమీ అనలేరు. ఏమీ అనని ఆ డాక్టరు ఇంటిమీద రాళ్లు విసిరాడు హరి.

హరి చేస్తూన్న అఘాయిత్యం యెంతదాకా పోయిందంటే. సాయంత్రం బండ్లను దిగిన ఆడవాళ్ళు ఊళ్ళోకి వెళుతూంటే, గొందుల్లో కాపుకాచి, వాళ్ళ చీరెలు లాగడం, బుగ్గలు నొక్కడం, ఇలాంటివి చేయడానికి ఓ గుంపును తయారుచేశాడు. అందులో, హరితో పాటు మరో పదిమంది వెధవలున్నారు.

దీపావళి యింకా నాలుగు రోజులుంది. ఆనాడు సాయంత్రం బండికి దిగిన ఇద్దరమ్మాయిలు హరి ఇంటివైపు వస్తూన్నారు. దగ్గరదారి గొందుల్లోంచే గనక వాళ్లు నిర్భయంగా నడిచి వస్తూన్నారు. హరిగాడి కుడిభుజంలాంటి మనిషి దీపక్ ఒక జిల్లీ కాల్చి వాళ్ళమీద విసిరేశాడు. ఆ జిల్లీ వెళ్ళి ఒకమ్మాయి చీరెలో పడ్డది. చీరె అంటుకుంది. 'గొల్లు' మంది ఆ అమ్మాయి. దీపక్ గాడు వెళ్ళి చీరెఆర్పి ఆవిడనిముద్దెట్టుకున్నాడు.

'అరే! గట్టిసరుకు' అన్నాడు దీపక్.

'అలాగా!' అని హరి దగ్గరగా వచ్చాడు. దీపక్ ఒక అమ్మాయినీ, హరి మరో అమ్మాయినీ ఇబ్బంది పెడుతూన్నారు. ఇంతలో వాళ్ళలో మరోడు వచ్చి టార్చివేశాడు. హరి నిర్ఘాంతపోయి ఆ అమ్మాయిని వదిలేశాడు. దీపక్ మాత్రం మరో అమ్మాయిని వదల్లేదు.

సంగతేమిటంటే, వాళ్లు హరి చెల్లెళ్లు. మద్రాసులో చదువుకుంటూన్నారు. పండక్కి ఇంటికి వస్తూన్నారు.

మర్నాటినుంచీ హరి బజార్లలోకి రావడం మానేశాడు. మొహం పీక్కుపోయి, పిచ్చివాడిలా ఇంట్లో గదిలో తలుపు వేసుకుని పడివుంటూన్నాడు. తన ఆప్తమిత్రులు ఎవళ్లొచ్చినా కనపడడు.